

**ముద్రగడ సూర్యప్రకాశరావు**

పొద్దు తెల తెల వారుతూంది.

సూర్యుని లేత కిరణాలు లోకం లోని చీకటి మూలలను వెతుక్కుంటున్నాయి. కిరణాల తాకిడికి తట్టుకోలేని మసక చీకట్లు ముక్కుతూ మూలుగుతూ చెదిరిపోతున్నాయి. చెట్లమీద పక్షులు ఒకదాన్నొకటి పలకరించుకుంటూ సందడిగా అటు ఇటు తిరుగుతున్నాయి. చెట్ల ఆకుల సందుల దాక్కున్న చిరు చీకట్లు బద్ధకంగా ఒళ్ళు విరుచుకుని ఇక తప్పదన్నట్లు దిగులుగా వెళ్ళిపోతున్నాయి. కొత్త బస్స్టాండు వెనక పక్కనున్న పెంటకుప్పల మీద బోర్లించిన కొబ్బరి చిప్పల ఆకారాల్లో ఉన్న దరిద్రపు ముద్దల లాంటి గుడిసెల్లోని చీకట్లు మాత్రం అంత తేలిగ్గా పోమంటూ భీష్మించుకు కూర్చున్నాయి. గుడిసెలకు కొంచెం దూరంలో ఉన్న మూడంతస్తుల మేడ సూర్యకిరణాలతో కుస్తీ పడుతూంది. పట్టు తప్పించుకొచ్చేసిన కిరణాలు కమ్మల కంతల్లోంచి, ద్వారం గుండా ఆ చీకటి గహ్వరాల్లోకి చొరబడి స్తిమిత నడుస్తున్నాయి.

ఆ గుడిసెల్లో రోడ్డు కానుకుని ఉన్న గుడిసెలోని కుక్కి నులకమంచంలో ముడుచుకొని పడుకొన్న అస్థిపంజరంలా ఉందొక మానవాకారం. ఒంటికి చుట్టు పెట్టిన చీరను బట్టి ఆమె స్త్రీ అని పోల్చుకోవచ్చు. ఆ ఆకారం పేరు గంగి. జీర్ణించుకుపోయిన ముఖంలో లోతుకు పోయిన కళ్ళతో, ముంజూరు నుండి వస్తున్న వెలుగు వైపు అర్ధనిమీలిత నేత్రాలతో చూస్తున్న ఆమె కళ్ళలో పారవశ్యం కైపు లేదు గాని, అలసట, నైరాశ్యం గూడుకట్టుకొని ఉన్నాయి. ఉండి ఉండి వస్తున్న పొడి దగ్గుకు ఆమె ఉక్కిరి బిక్కిరవుతూ ఉంగముట్టుకు పోతూంది.

“ఓరయ్యా” అని నీరసంగా పిలిచింది. ఆ పిలుపులో జీవం లేదు.

“ఓరే, అయ్యా!” చాలా రోజుల్నుంచి తిండిలేక ఎండిపోయిన ప్రేగుల్లోంచి పొడారిపోతూన్న గొంతునుండి నీరసంగా వచ్చిందా పిలుపు. ఆమాత్రం పిలుపుకే ఆరు దబ్బన్న మెట్లెక్కినంత ఆయాస పడిపోయింది.

“ఓరయ్యా! పిలుస్తుంటే పలకవేంరా నంజికొడకా!” నీరసంగా తిట్టింది.

పక్కనే నేలమీద గోనెపట్టా పరుచుకొని పడుకున్న బంగారి బద్ధకంగా ఒళ్ళిరుచుకొని అటు వైపు ఒత్తిగిలి పడుకున్నాడు.

“ఓరయ్యా!” ఈ సారి అది పిలుపులా కాదు, నిస్సహాయురాలి ఏడుపులా ఉంది.

గంగి గొంతు వినిపించి బంగారి గభాలున లేచి కూర్చున్నాడు.

“ఏమే, ఏటయింది” అన్నాడు కళ్ళు నులుముకుంటూ. సమాధానం రాక పోగా లేచి దగ్గరగా వెళ్ళాడు.

“ఏమే, ఏటి కావాలి? మంచినీళ్ళు కావాలా?” అన్నాడు.

“ఊఁ” అని మూలిగింది.

“మళ్ళీ జరంగాని ఎక్కువైందేటి?” మంచినీళ్ళు పట్టి, నుదుటి మీద చేయి వేసి చూశాడు. “అమ్మో, ఎంత ఏడిగున్నదో! జరం పేలిపోతంది” అంటూ గాభరా పడిపోయాడు. ఆత్రతగా ఏం చెయ్యాలో తోచక అటు ఇటు తిరిగాడు. మంచం కింద తల వైపు ఉన్న మందు సీసా కనిపించింది.

“అవునొలె— పొద్దుటేల మందింకా మప్పు తాగనేదా? తాగవాదా?” అంటూ సీసా నోటి దగ్గర పెట్టాడు.

“అది మందు కాదురా. . . రంగు నీళ్ళు. అందులో సచ్చేంత సేదు కలిపిచ్చిండు ఆ డాట్రు సచ్చినోడు డబ్బులడిగేసుకుని” అంది మందుసీసాను తోసేస్తూ.

“అలాగనకే. ఈ పాలి మంచి గట్టి మందిచ్చాడు ఆ డాట్రు. . . ఇదిగాని తాగినావంటే తక్షణం జరం తగ్గిపోద్ది.


ఏం చేసినా మాట సాయమే గాని డబ్బు సాయం ఏమీ చెయ్యలేక పోతున్నాము. కడుపు చించుకుంటే కాళ్ళ మీద పడతం దని మనకి నోట ఏదన్నా చెయ్యాల నున్నా చేతిలో కాండబ్బు అడనప్పుడు చెయ్యగలిగింది మాత్రం ఏముంటాది?" బాధగా అన్నాడు మునలయ్య.

బంగారి కొద్ది క్షణాలు మౌనంగా ఉండిపోయాడు. వాడి మస్తిష్కంలో ఎన్నెన్నో ఆలోచనలు చెలరేగుతున్నాయి. ఉన్నట్టుండి ఒక్కసారి గభాలున లేచాడు. "మునలయ్యా, నువ్వో సాయం చెయ్యాల్రా ... నీ పెళ్లాలి కూతురి మీద నీ కేమాత్రం అభిమాన మున్నా నే చెప్పిన పని చెయ్యాలి."

"చెప్పరా. డబ్బులు తప్ప మరే సాయం అయినా చెయ్యడానికి నేను రడీగా ఉన్నాను" అన్నాడు మునలాడు.

"మరేం లేదు. నాను మునలాణ్ణయి పోయాను గదా ... మా ఉంటే నాలు గైదు సంవత్సరాలు బ్రతుకుతాను.పండి నాకు ఎప్పటికైనా రాలిపోవలసిందేగదా! కాని, గంగి ... దాని వొయసు పదారైనా నిండకుండానే చచ్చేదాన్లాగుంది. దానికి మందు తిప్పించటానికి డబ్బులు లేవు. నేను బతికుండగా డబ్బు సంపాదించ లేను. అందుకే సచ్చయినా నాలుగు డబ్బులు సంపాదించి దాన్ని బతికిస్తాను. నువ్వు చెయ్యగలిగిన సాయం అంతా సాచ్చెం చెప్పడమే. నేను ఎవరైనా డబ్బున్న వాళ్ళ కారు క్రింద పడతాను. వెంటనే నువ్వు అల్లని దబాయించి డబ్బు గుంజడమే ... ఎంతో అవసరం లేదు, మూడొందలు సాలు. ఆ డబ్బెట్టి నువ్వు గంగికి వైద్యం చేయించాల. బొమ్మరిది వైనందుకు నువ్వీ సాయం చెయ్యాల. నీకు పిల్లా జెల్లా లేరుకదా? నేను సస్తే గంగిని సూసుకుంటూ దాందగ్గరే ఉండిపో ... దాన్ని నారిగాడి కిచ్చి పెళ్ళి చెయ్యి" అన్నాడు. ఈ మాటలు అంటున్నప్పుడు బంగారి కళ్ళ నుండి ధారాపాతంగా కన్నీరు కారు తూంది. మునలాడు అందుకు ఒప్పుకో లేదు. కాని, బంగారి చాలాసేపు నచ్చ చెప్పాడు. "ఇది తప్ప మరి గత్యంతరం లేదు" అంటూ చివరకు మునలాణ్ణి ఒప్పించాడు.

బంగారి కిప్పు డెంతో ఆనందంగా ఉంది! డబ్బున్నోళ్ళ కారు కింద పడితే తనకు ఏ కాలో చెయ్యో ఇరుగుద్ది. గట్టిగా పట్టుపడితే తప్పకుండా మూడు నాలు గొందలు డబ్బు లాగొచ్చు. దాంతో గంగికి జబ్బు బాగు చేయించొచ్చు. నారి గాడితో దాని పెళ్ళయిపోతే తమ ఏ గుడి



నీడలు — జాడలు ఫోటో—భరద్వాజ (మద్రాసు)

సైనా కూకొని అడుక్కుంటే కాల క్షేపం అయిపోద్ది. ఒకేల వచ్చినా పెద్ద గొడవుండదు.

'రే పొద్దున్న అయితే ఆఫీసలకి ... కంపెనీలకి ... షాపులకి ఎళ్ళే వోళ్ళు అరిజంటు మీద ఎల్తుంటారు. అప్పు డయితేనే బాగుంటాది' అని ఆలోచించు కున్నారు బంగారి, మునలయ్యా కలిసి. మునలయ్య తన దగ్గరున్న అయిదు రూపా యలని బంగారికిచ్చాడు. "ఒరే, బంగారీ! అదురుష్టం బాగునేకపోతే నువ్వు బతికేది ఈ రో జొకటే అవుద్ది. కాబట్టి బతి కుండే ఈ ఒక్క రోజన్నా మబ్బరంగా జలపా చేసుకొని తిను. దానికోసం ఏదన్నా కొనట్టుకెళ్ళు" అన్నాడు ఏడుపు ముఖంతో.

బంగారి ఆ రాత్రి గుడిసె కెళ్ళి ఆఖరిసారి అనుకొని గంగిని చూసేసి దానికి ద్రాక్ష పళ్ళు, రొట్టె, పాలు కొని ఇచ్చాడు.

"డబ్బు లెక్కడియి" అని గంగి అడి గితే, "అయ్యన్నీ నీ కెందుకు ... నేను తెచ్చినయి మబ్బరంగా తిను" అన్నాడు. ఆ రాత్రి సారకొట్టు కెళ్ళి బాగా తాగేసి గుడిసె కెళ్ళకుండా వీధులన్నీ తిరిగి తిరిగి రోడ్డు పక్కన పడి నిద్రపోయాడు. మరునటి రోజున ఉదయం పావర్ బజారుకు కొంచెం అవతల మెయిన్ రోడ్డు మీద బంగారి, మునలాడు, మునలాడు కుదుర్చుకొచ్చిన ఇద్దరు రౌడీలు నిలబడ్డారు. మరొకడు కొంచెం ముందుకు నిలబడి పెద్ద పెద్ద కార్లొస్తున్నప్పుడల్లా సైగచేసి చెపు తున్నాడు.

బంగారికి గుండె పీకుతూంది— "సేతు లారా పేణాల్ని తీసుకోడం ఎందుకో" అని. 'కాని, తెగించినోడి కియన్నీ ఏటి? మున లాణ్ణి, నేను సస్తే ఏటి బతికుంటే ఏటి?' అనుకుని గుండె దిటవు పరుచుకున్నాడు. కొంచెం దూరంగా నిలబడ్డవాడు సైగ చేశాడు, పెద్ద కారొస్తాందని. ఆ తరవా తెప్పుడో రోగంతో రొప్పుతో సచ్చే బదులు ఇప్పు డీ కారు కింద పడి సీమవాగ నలుక్కున సస్తేనే మంచిది' అని నిశ్చయించుకొని రోడ్డు మీదకు నడిచాడు. కారు వస్తున్న వైపు ఎదురుగా నడిచాడు... గుండె కొట్టుకుం టున్నది. మనసంతా భయంతో నిండి పోయి ఆయాసం వస్తూంది. కారు దగ్గరపడగానే కళ్ళు మూసుకుని గభాలున ముందుకు నడిచాడు. "క్రీచ్" మని కారు బ్రేకులు వేసిన శబ్దం. అంతే. ధన్ మని కారు అతన్ని గుద్దెయ్యడం, బంగారి క్రింద పడగానే చక్రం అతని మీద నుండి వెళ్లిపోవడం ఒక్కసారే జరిగాయి.

కొద్దిగా తెలివి వస్తూంది బంగారికి. మూతలు పడుతూన్న కళ్ళను బలవం తంగా తెరిచాడు. తన చుట్టూ జనం. తనవైపే చూస్తున్నారు ఆత్రతంగా. వాళ్ళందరి ముఖాలలోను ఆత్రత, జాలి, బాధ కనిపిస్తున్నాయి. తనకు ఒళ్ళంతా తీవ్రమైన బాధ; వేయి సూదులతో పొడుస్తున్నట్టు, నరాల్ని ఎవరో పట్టుకు లాగేసి కోసేస్తున్నట్టు తీవ్రమైన బాధ. అంత బాధతోనూ తన కళ్ళు మునలాడి కోసం వెదుకుతున్నాయి. మునలాడు ఎవరి పైనో కేకలేస్తున్నాడు. వాడు కుదుర్చు కొచ్చిన రౌడీలు కూడా మునలాడి వైపే ఉండి గదమాయించి అడుగుతున్నారు. తన చుట్టూ రక్తం. కళ్ళు తిరిగి పోయాయి బంగారికి ... గట్టి దెబ్బలే తగిలాయి, 'సచ్చిపోతానేమో' అనుకోగానే గుండెలో తీవ్రమైన ఆవేదన, ఆతృత ప్రారంభ మయ్యాయి. 'అయినా, డబ్బొ స్తుంది కదా ... గంగి బతికి బాగుంటే సాల్లే' అనే ఆలోచన కొంత బాధను దూరం చేసింది. తనను తొక్కేసిన విమానం లాంటి కారుకోసం చూశాడు. అదెక్కడా కనిపించలేదు. ఏదో డొక్కు టాక్సీ మాత్రం కొంచెం దూరంలో ఉంది. 'అయితే, తనను తొక్కేసింది ఈ టాక్సీ బండా!' అనుకున్నాడు. టాక్సీ పక్కను నిలబడి పోలీసులు ఏవో వ్రాసుకుంటున్నారు. వాళ్ళ మధ్య నారి గాడు ... 'నారిగాడే ... సందేహంలేదు. ఏడుస్తూ వాళ్ళతో ఏదో చెప్పుకుంటూ ప్రతిమాలుతున్నాడు.

'ఆ... నారిగాడు ... ఆ డిక్కడి కెలా వచ్చాడు? పోలీసులు ఆణ్ణెందుకు పట్టుకున్నారు ... అల్లంతా ఆణ్ణెందుకు గదమాయిస్తున్నారు... అసలు జరిగిం దేమిటో ...'

"ఒరే, మునిరీ ... మునిరీ ..." అనరి చాడు. కాని, ఆ మాట ఎవరికీ వినిపించ లేదు.

ఎవడో అంటున్నాడు: "వెధవ! అంత స్పీడుగా పోవడం దేనికి? పాపం, అనవ సరంగా మునలాడి ప్రాణం మీదకు తెచ్చాడు."

నారిగాడు ఏడుస్తూ తన దగ్గరి కొచ్చాడు. "పొద్దున్నే బండేసుకొని ఊళ్ళో కెలుతూ ఓ సారి సూసిపోదామని గంగి దగ్గరి కెళ్లాను. దాని కేటయిందో ఏటో నోటమ్మట మాట రావడం లేదు. తెగ ఆయాస పడిపోతోంది. ఒళ్ళంతా సల్లగా అయిపోయింది. ఎంటనే బండిలో ఏసు కొని ఆస్పత్రిల జాయిన్ సేయిద్దారని బయలెల్లా స్పీడుగానే నడుపుతున్నాను బండిని ... ఎదురుగా వస్తున్న పెద్ద కారు సర్‌మని సడన్ బ్రేకేసి పక్కకు తిప్పెయ్య గానే నా బండిని గుద్దేస్తాడని నేను ఆటెల్లనిచ్చాను. సూస్తే బండి కింద నువ్వున్నావు ... బండిలో గంగున్నది కాని, నువ్వు దాన్ని సూడ్లేవు ... అది గూడ నిన్ను సూడలేదు..." ఇంకా ఏవేవో చెపుతున్నాడు ... బంగారి కివేం వినిపిం చడం లేదు. చెవులు దిబ్బడ వేసినట్టు ఉయింది. కళ్ళకుమాత్రం డొక్కు టాక్సీ కనిపిస్తూంది. 'దాన్లోనే గంగున్నా దట ... కాని, దాన్ని సూడ్డాని కవదు... కళ్ళ ముందు ఏదో మసక ... కళ్ళు మసకలు కమ్మేస్తున్నాయి. బుర్ర తిరిగి పోతూ ఉంది.... అమ్మా ... గంగీ ...' వాడి హృదయం ఏడుస్తూంది...

మూతలు పడుతూన్న బంగారి కళ్ళకు ఆఖరి సారిగా ఏడుస్తున్న నారిగాణ్ణి పోలీసులు బలవంతంగా లాక్కెళ్ళడం కనిపించింది. ★